# కంచే చేను మేస్తే!



కొండముది సుక్షేత్ర దేవి

"పండక్కి మీనాన్న వాచీకొనిపెడతాడను కున్నాను" భార్యవైపు చూస్తూ అన్నాడు రామచంద్ర.

"మా నాన్నకు అంత తాహతులేదు. ఆ సంగతి తెలిసికూడా ఆశలు పెంచుకోవటం అవివేకం." ఖచ్చితంగా అన్నది శ్రీలక్ష్మి.

"ఇందులో ఆశేమున్నది ? కొత్తఅల్లుడు మామగారి నుంచి ఈ చిన్న కోరిక తీర్చుకో వాలనుకోవటం తప్పేమీకాదే ?"

"కోరికలకు చిన్నా, పెద్దా ఏమిటి ? ఇవ్వగలశక్తి వుంటే ఎంత పెద్ద బహుమతులైనా ఇవ్వవచ్చు. పండక్కు పిల్చినా, పెళ్లికి పిల్చినా, పప్పు, అన్నంతప్ప మానాన్న ఇంకేమీ పెట్టలేదు." అంటూ వంట ఇంట్లోకి వెళ్లింది శ్రీలక్ష్మి.

తీరని కోరికని కోపంగా మార్చుకుని, వీధిగేటు ధడాల్నవేసి, రోడ్డెక్కాడు రామచంద్ర.

ఆరోడ్డుమీద పదిబారలు పోయి మలుపు తిరిగితే, మెయిన్‌రోడ్డు వస్తుంది.

మెయిన్ రోడ్డు మీద నడుస్తున్న రామచంద్ర ఆలోచనలతో సతమతమవుతూ, సడన్‌బ్రేకు వేసినట్లు తక్కున ఆగిపోయాడు. క్షణకాలం ఆశ్చర్యపోయినా, తన కళ్లను తనే నమ్మలేకపోతున్నాడు.

కానీ...

మొన్న అత్తవారింటికి పండక్కి వెళ్లే రోజు ఈ షాపు ఇక్కడలేదు. ఇక్కడేకాదు ఈ వూళ్లో ఎక్కడాలేదు. ఇదివరకు గడియారం కొనుక్కోవాలంటే పక్కనున్న పట్నం వెళ్ళి కొనుక్కోవలసి వచ్చేది. మరిప్పుడు ? తనింటికి పదిబారల్లో గడియారాల షాపు వుంది.

"ఎక్కడికోవెళ్ళి కొనుక్కోవాలంటే కుదరదుగాని, అతి సమీపంలో వున్న గడియారాల షాపులో గడియారం కొనుక్కోవటం ఎంత పేపు' అనుకున్నాడు. కాని వెంటనే స్ఫురణకు వచ్చింది. తనకు వచ్చే జీతం అన్నానికి, బట్టలకు మాత్రమే సరిపోతుందన్నసంగతి. ఈసారి తనమీద తనకే కోపం వచ్చిందిగాని, వెంటనే తండ్రిమీదకు మళ్లింది. చదువు, సంధ్యలు, ఆస్తిపాస్తులు ఇవ్వలేదు గాని నిజాయితీగా బ్రతకడం మాత్రంనేర్పాడు ముసలాయన. తన రోజుల్లో గనక నీతికి, నియమానికి విలువ వుండేది. ఈ రోజుల్లో... తనతోపాటు గుమాస్తాగిరి చేస్తున్నవాళ్ల గడియారాలు,

బట్టలు వంటి చిన్నచిన్న వస్తువులేకాదు—స్థలాలు, పొలాలే కొంటున్నారు, మరి తనో...

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో ఆదర్శాలు, కట్టుబాట్లు అంటూ అన్యాయాలకు దూరంగా వున్నాడు. మొదట్లో కొంతమంది ఆ ప్రస్తావన తీసుకు వచ్చినా తను వాళ్ళను చివాట్లు వేసి పంపించాడు. తరువాత ఎవరూ ఏ పనిమీదా తనదగ్గరకు రాలేదు. ఉద్యోగంలో చేరి అయిదారేళ్ళయినా, ప్రమోషనులేదు సరికదా ఇంక్రిమెంటు కూడాలేదు. ఛీ... ఛీ... వెధవ బ్రతుకు... అసలు భగవంతుడికే బుద్ధిలేదు. డబ్బులేని వాళ్ళందర్నీ ఒక కులంలో పుట్టించకూడదూ?... దేవుడికి కులాలు, మతాలు ఏమిటి? అవన్నీ మానవులు ఏర్పరచుకున్న పుక్కు గోడలు. ముళ్ళకంచెలు'' ఆలోచిస్తూ నడుస్తున్న రామచంద్ర కాలికేదో తగలటంతో కిందికి చూశాడు. ఎర్రటి పొడుగాటి గడియారపు పెట్టె. అటు ఇటు చూసి, క్షణం తటపటాయించి, చేతిలోకి తీసుకున్నాడు. గుండె దిటవు చేసుకుని పెట్టె తెరచి చూశాడు. కళ్ళు జిగేల్ మన్నాయ్. పెట్టెలోవున్న కొత్త గడియారం తళతళా మెరుస్తున్నది. మనసులో మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. కానీ వెంటనే ఆ గడియారపు పెట్టె జేబులో పెట్టుకుని భయం భయంగా రెండడుగులు వేశాడు. వంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లుంది. మొయ్యలేని బరువేదో మీదపడ్డట్లనిపించి, నడుస్తున్న రోడ్డుదిగి, సందు మలుపు తిరిగి తిన్నగా పోలీసుస్టేషనుకువెళ్ళి, ''ఆ గడియారం తనకు రోడ్డుమీద దొరికిందని, పేపర్లో ప్రకటించి పోగొట్టుకున్న వ్యక్తికి ఆ గడియారం అందజెయ్య''మని అక్కడ డ్యూటీలోవున్న కానిస్టేబులుకి చెప్పి, గడియారపు పెట్టె జాగ్రత్తగా టేబులుమీద పెట్టి, తేలిగ్గా గాలి పీల్చుకుని, బయటకు వచ్చాడు రామచంద్ర.

అక్కడున్న కానిస్టేబులు రామచంద్రాన్ని కనీసం కూర్చోమని అన్నా అనలేదు సరికదా, ఓ పిచ్చివాడ్ని చూసినట్లు చూశాడు.

మంచునే ఓపికలేక ''మరి నేవెళ్ళొస్తా!'' అంటూ రోడ్డెక్కాడు.

* * *

పండక్కురమ్మని మామగారు రాసిన ఉత్తరం చూసుకుని ఉత్సాహంగా ప్రయాణమైనాడు రామచంద్ర అత్తవారింటికి.

పండగరద్దీ అంతా బస్సుస్టాండులోనే వున్నట్లుంది. దిగేవాళ్ళను దిగనివ్వకుండానే, బస్సెక్కటానికి కుస్తీపడుతున్నారు జనం. బస్సులు వచ్చీరాకముందే ఈగల్లా ముసురుతున్నారు. అంతరద్దీలోనూ తోసుకుని, తొక్కుకుని బస్సెక్కాడు రామచంద్ర. అనుకోకుండా దొరికిన మంచి సీట్లో ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా కూర్చుని విజయగర్వంతో నాలుగువైపులా చూశాడు. ఆ చూపు అతనిప్రక్కన కూర్చున్న ఆధునిక యువకుడి అందమైన చేతిగడియారం మీద పడ్డది. కళ్ళు చికిలించి చూశాడు. అదే ... అదే...కళ్ళు గట్టిగా మూసుకుని తెరిచి మరీ చూశాడు. అదే...

రామచంద్రకు ఆలోచన్లు తెగటంలేదు. కాసేపటికి తేరుకుని పక్కమనిషిని మాటల్లోకి దింపాడు.

''మీ గడియారం చాలా బాగుంది. ఎక్కడ కొన్నారు?'' అంటూ.

''ఇది నేను కొనలేదు. అత్తవారిచ్చిన పండగ బహుమతి'' గర్వంగా చెప్పాడతను.

''అలాగా! చాలా బాగుంది. మీ అత్తవారిది ఏవూరు?''

''ఈవూరే! మా మామగారు కానిస్టేబులుగా పని చేస్తున్నారు.''

రామచంద్రకు చెంపమీద ఛెళ్ళున కొట్టినట్లనిపించింది ఆ మాటతో. మాట్లాడలేదు గాని మనస్సు సాగరతరంగమైంది. మంచితనానికి విలువలేని సమాజంమీద పగ, ద్వేషం అలలు అలలుగా లేచాయి. దేన్నయినా తనలో ఇముడ్చుకోగలిగిన సముద్రుడిలా రామచంద్ర పెదవి కదపలేదు.

అన్యమనస్కంగా అత్తవారింటికి చేరిన అతడికి ఎప్పటికంటె ఎక్కువ మర్యాదలు జరిగినా అక్కడివారి మనసుల్లో ఏదో బాధ పసిగట్టిన రామచంద్ర వుండబుద్ధికాక మర్నాడే తిరుగు ప్రయాణమయినాడు. ఎంత బ్రతిమిలాడినా, ''అర్జంటు పని ఉంది. వెళ్ళితీరాలి'' అని పట్టుబట్టిన అల్లుడి చేతిలో కొత్తబట్టలు పెడుతూ, 'నీకోరిక తీర్చలేకపోయాం. ఏమీ అనుకోకు రామచంద్రా' అన్నాడు బాధగా మామగారు.

''ఎంత పాసిష్టివేళ కొన్నారో ... ఇంటి కన్నా తీసుకురాలేదు'' కళ్ళు వత్తుకుంది అత్తగారు.

''నా మొదటినెల జీతంతో మీకు గడియారం కొనిద్దామని...'' స్వగతంలా అన్నాడు బావమరిది.

ఈ మాటలేవీ అర్థంకాని రామచంద్ర భార్యవంక అయోమయంగా చూశాడు.

''నాన్న ఎంతగా అనుకున్నా కొనివ్వలేని గడియారాన్ని, మా అన్నయ్య తన మొదటినెల జీతంతో కొనిద్దామని డబ్బిచ్చాడు. ఆ డబ్బు తీసుకుని మనవూరువచ్చి, గడియారం కొని మనింటికి వస్తుంటే దారిలో...'' శ్రీలక్ష్మి మాట పూర్తిచెయ్యకుండానే ''ఎర్రని పెట్టె. ఎంతో బాగుందిట.'' అత్తగారి మాటవిన్న రామచంద్రానికి మరణించిన మంచితనం మరింకేం చెయ్యగలదనిపించింది.

